మనం
కడప | అన్నమయ్య

# ఎంపీటీసీ ఎన్నికల సందడి షురూ!

**తొలిరోజు రెండు స్థానాలకు నామినేషన్లు ప్రక్రియను పరిశీలించిన డీఎస్పీ**

ముద్దనూరు అక్టోబర్ 21 మనంన్యూస్: మండల పరిధిలోని పది ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికల కమిషన్ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం బుధవారం నుంచి ఈ నెల 23వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. మొదటిరోజు నల్లబల్లె, యామవరం ఎంపీటీసీ స్థానాలకు కూటమి నాయకులు నామినేషన్లు దాఖలు చేసినట్లు రిటర్నింగ్ అధికారి రఘురాం తెలిపారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను డీఎస్పీ వెంకటేశ్వరరావు పరిశీలించారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా స్థానిక సీఐ నగేష్ బాబు, ఎస్సై మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలీసుల పర్యవేక్షణలో మొదటిరోజు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందని పోలీసు అధికారులు వెల్లడించారు.

# కడప గడ్డపై పసుపు జెండా రెపరెపలు

జడ్పీటీసీ బరిలో తొలిరోజే టీడీపీ సరికొత్త జోరు!

నామినేషన్లలో తిరుగులేని ఆధిపత్యం..

16 స్థానాలకు గాను 12 చోట్ల టీడీపీ అభ్యర్థుల నామినేషన్లు

ప్రత్యర్థి పార్టీలకు దిమ్మతిరిగే షాక్..

వైఎస్సార్‌సీపీకి 3, బీజేపీకి 1 నామినేషన్ మాత్రమే

పులివెందుల, వేంపల్లి సహా కీలక స్థానాల్లో టీడీపీదే ఏకైక నామినేషన్




మనం ప్రతినిధి, రాజంపేట అక్టోబర్ 21
వైఎస్సార్ కడప జిల్లా స్థానిక సమరంలో తెలుగుదేశం పార్టీ తొలిరోజే సంపూర్ణ ఆధిపత్యం ప్రదర్శించింది. ఎవరూ ఊహించని రీతిలో రికార్డు స్థాయిలో నామినేషన్లు దాఖలు చేసి ప్రత్యర్థులకు గట్టి హెచ్చరిక పంపింది. బుధవారం సాయంత్రం 5 గంటల నాటికి జిల్లావ్యాప్తంగా వివిధ జడ్పీటీసీ స్థానాలకు మొత్తం 16 నామినేషన్లు దాఖలు కాగా, అందులో ఏకంగా 12 నామినేషన్లు టీడీపీ అభ్యర్థులవే కావడం విశేషం. వైసీపీ కేవలం 3 నామినేషన్లకే పరిమితం కాగా, బీజేపీ నుంచి ఒక్కరు మాత్రమే దాఖలు చేశారు. జనసేన, స్వతంత్రులు తొలిరోజు ఖాతా తెరవలేదు.

**ప్రత్యర్థి కంచుకోటల్లోనూ పసుపు దళం దూకుడు**

ఎంతో కీలకమైన పులివెందుల, వేంపల్లి నియోజకవర్గ పరిధిలోని జడ్పీటీసీ స్థానాలతో పాటు పోరుమామిళ్ల, కొండాపురం, మైలవరం, వల్లూరు, వీరపనాయునిపల్లెల్లో తొలిరోజే టీడీపీ అభ్యర్థులు ఒంటరిగా నామినేషన్లు వేసి తమ పట్టును నిరూపించుకున్నారు. ఈ ఏడు స్థానాల్లో ప్రత్యర్థి పార్టీల నుంచి కనీసం ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాకపోవడం గమనార్హం. మరోవైపు ఖాజీపేట, మైదుకూరులలో కూడా రెండేసి చొప్పున నామినేషన్లు టీడీపీ అభ్యర్థులే వేసి సంపూర్ణ ఆధిపత్యం చూపారు. బి.కోడూరులో దాఖలైన మూడు నామినేషన్లలో టీడీపీ నుంచి ఒకరు, వైసీపీ నుంచి ఇద్దరు దాఖలు చేయగా, జమ్మలమడుగులో వైసీపీ, బీజేపీల నుంచి ఒక్కొక్కరు చొప్పున నామినేషన్ వేశారు.

**శ్రేణుల్లో వెల్లువెత్తిన ఉత్సాహం**

నామినేషన్ల ప్రక్రియ అక్టోబర్ 21 నుంచి 23 వరకు జరగనుండగా, మొదటి రోజే 75 శాతానికి పైగా స్థానాల్లో పసుపు జెండా రెపరెపలాడటంతో టీడీపీ శ్రేణుల్లో నయా జోష్ నెలకొంది. పార్టీ కేడర్, అభ్యర్థులు బాజాభజంత్రీలు, భారీ ర్యాలీలతో తరలివచ్చి నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారులకు సమర్పించారు. జిల్లాలోని 39 జడ్పీటీసీ స్థానాల్లో మెజారిటీ స్థానాలను క్లీన్ స్వీప్ చేయడమే లక్ష్యంగా నాయకులు రంగంలోకి దిగడంతో, మిగిలిన రెండు రోజుల్లో కూడా టీడీపీ నామినేషన్ల జోరు మరింత పెరగనుంది. తొలిరోజే చూపిన ఈ దూకుడుతో ప్రత్యర్థి వైఎస్సార్‌సీపీ శ్రేణులు డిఫెన్స్‌లో పడ్డాయి.

# వైఎస్సార్ కడపలో ఎంపీటీసీ పోరు షురూ

## తొలిరోజే పోటెత్తిన నామినేషన్లు

మొత్తం 291 దరఖాస్తులు దాఖలు

247 స్థానాల్లో టీడీపీ ముందంజ

వైసీపీ 20, బీజేపీ 10, జనసేన 7.. పలు మండలాల్లో ఇంకా తెరవని ఖాతాలు




మనం ప్రతినిధి రాజంపేట అక్టోబర్ 21
వైఎస్సార్ కడప జిల్లాలో ఎంపీటీసీ ఎన్నికల సందడి ఒక్కసారిగా వేడెక్కింది. తొలిరోజు నామినేషన్ల పర్వంలో అధికార, ప్రతిపక్ష పార్టీల కదలికలతో గ్రామీణ రాజకీయం రసవత్తరంగా మారింది. జిల్లావ్యాప్తంగా బుధవారం సాయంత్రం 5 గంటల వరకు అందిన గణాంకాల ప్రకారం మొత్తం 291 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో తెలుగుదేశం పార్టీ అత్యధికంగా 247 నామినేషన్లు వేసి స్పష్టమైన ఆధిక్యం కనబరిచింది. ప్రధాన ప్రతిపక్షం వైఎస్సార్సీపీ నుంచి 20, బీజేపీ నుంచి 10, జనసేన నుంచి 7, ఇతరులు/స్వతంత్రుల నుంచి మరో 7 నామినేషన్లు నమోదయ్యాయి. తొలిరోజే భారీ సంఖ్యలో నామినేషన్లు రావడంతో గ్రామీణ కేడర్‌లో ఎన్నికల సందడి నెలకొంది.

**చాపాడు మండలం టాప్.. ఖాజీపేట, వేంపల్లెల్లో జోరు**

మండలాల వారీగా పరిశీలిస్తే చాపాడు మండలం 29 నామినేషన్లతో జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. ఆ తర్వాత స్థానాల్లో వేంపల్లె (22), ఖాజీపేట (21), మైలవరం (19), బి.మట్టం (18), పెండ్లిమర్రి (17), తి.సుండుపల్లె (16), చెన్నూరు (12) నిలిచాయి. పోరుమామిళ్ల, పెద్దముడియంలలో 11 చొప్పున నామినేషన్లు దాఖలయ్యాయి. పోరుమామిళ్లలో టీడీపీ 10, జనసేన 1 నామినేషన్ దాఖలు చేయగా, పెద్దముడియంలో టీడీపీ 8, వైసీపీ 2, బీజేపీ 1 దరఖాస్తు చేశాయి.

**రాజంపేటలో వైసీపీ పైచేయి..**

రాజంపేట మండలంలో స్థానిక సమీకరణాలు భిన్నంగా కనిపించాయి. ఇక్కడ నమోదైన 10 నామినేషన్లలో వైసీపీ 6 దాఖలు చేసి ఆధిక్యం ప్రదర్శించగా, టీడీపీ నుంచి 4 వచ్చాయి.

**మైలవరంలో రసవత్తర పోరు**

మైలవరంలో త్రిముఖ పోటీ వాతావరణం కనిపించింది; ఇక్కడ మొత్తం 19 నామినేషన్లు రాగా టీడీపీ 10, వైసీపీ 5, బీజేపీ 4 దరఖాస్తు చేశాయి. మైదుకూరులో మొత్తం 9 నామినేషన్లలో టీడీపీ 6, వైసీపీ 3 నమోదు చేయగా, కొండాపురంలో టీడీపీ 4, వైసీపీ 1 దరఖాస్తు చేసుకున్నాయి.

**పలు మండలాల్లో ఏకపక్షంగా టీడీపీ నామినేషన్లు**

ఖాజీపేటలో నమోదైన 21 నామినేషన్లలో టీడీపీ 19, జనసేన 2 దాఖలు చేశాయి. వేంపల్లెలో నమోదైన 22 దరఖాస్తుల్లో టీడీపీ 19, జనసేన 2, బీజేపీ 1 సమర్పించాయి. పెండ్లిమర్రిలో టీడీపీ 16, బీజేపీ 1 నామినేషన్ వేశాయి. తి.సుండుపల్లెలో టీడీపీ 15, జనసేన 1 దాఖలు చేయగా.. బి.మట్టం (18), కలసపాడు (8), చెన్నూరు (12) మండలాల్లో టీడీపీ అభ్యర్థులే ప్రధానంగా బరిలో నిలిచారు.

**మొదటి రోజు బోణీ కొట్టని వైసీపీ.. ఇంకా ముగియని గడువు**

పులివెందుల, జమ్మలమడుగు, కమలాపురం, బద్వేలు, చాపాడు, దువ్వూరు, చక్రాయపేట, వల్లూరు, సిద్దవటం, లింగాల, వేముల సహా 20కి పైగా మండలాల్లో వైఎస్సార్సీపీ తొలిరోజు ఒక్క నామినేషన్ కూడా దాఖలు చేయలేదు. అయితే ఇది వ్యూహాత్మక జాప్యమేనని, క్షేత్రస్థాయిలో అభ్యర్థుల ఎంపిక కసరత్తు పూర్తయ్యాక మిగిలిన గడువు రోజుల్లో నామినేషన్లు భారీగా దాఖలవుతాయని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

**మండలాల వారీగా అందిన పూర్తి వివరాలు:**

అట్లూరు (3), బి.కోడూరు (4), బద్వేలు (0), గోపవరం (6), కలసపాడు (8), పోరుమామిళ్ల (11), ఎస్ఏ కాశినాయన (2), జమ్మలమడుగు (1), కొండాపురం (5), మైలవరం (19), పెద్దముడియం (11), చెన్నూరు (12), సీకే దిన్నె (10), ఖాజీపేట (21), పెండ్లిమర్రి (17), సిద్దవటం (4), తి.సుండుపల్లి (16), వల్లూరు (5), వీరబల్లి (0), ఒంటిమిట్ట (1), కమలాపురం (6), వీఎన్‌పల్లి (5), బి.మట్టం (18), చాపాడు (29), మైదుకూరు (9), దువ్వూరు (8), ముద్దనూరు (2), ప్రొద్దుటూరు (0), రాజుపాలెం (1), ఎర్రగుంట్ల (10), చక్రాయపేట (1), లింగాల (2), పులివెందుల (2), సింహాద్రిపురం (3), తొండూరు (0), వేంపల్లి (22), వేముల (5), నందలూరు (2), రాజంపేట (10).






# ఘోర రోడ్డు ప్రమాదం.. ఒకే కుటుంబంలో ముగ్గురు మృతి

## ఆసుపత్రికి తరలిస్తుండగా మూడేళ్ల బాలుడు మృతి – యామవరం గ్రామంలో విషాదఛాయలు

ముద్దనూరు,అక్టోబర్ 21 మనం న్యూస్:
ముద్దనూరు–తాడిపత్రి ప్రధాన జాతీయ రహదారిపై బుధవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందారు. వెనుక నుంచి వచ్చిన కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్రంగా గాయపడిన మూడేళ్ల బాలుడు ప్రొద్దుటూరుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఈ విషాద ఘటనతో యామవరం గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. స్థానికుల వివరాల మేరకు యామవరం గ్రామానికి చెందిన బందా వెంకటేష్ (60), బందా సుబ్బరాయుడు (35), వెంకటేష్ మనవడు తన్విత్ (3) తమ సొంత పనుల నిమిత్తం ముద్దనూరు పట్టణానికి వచ్చారు. పనులు ముగించుకుని తిరిగి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా గ్రామ సమీపంలో వెనుక నుంచి వచ్చిన కారు వారి వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెంకటేష్, సుబ్బరాయుడు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మూడేళ్ల బాలుడు తన్విత్ తీవ్రంగా గాయపడటంతో స్థానికులు వెంటనే స్పందించి ప్రైవేట్ వాహనంలో ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందారు. ప్రమాద సమాచారం అందుకున్న సీఐ నగేష్‌బాబు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రమా దానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఈ హృదయవిదారక ఘటనతో యామవరం గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. ముగ్గురి మృతితో గ్రామస్తులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు.

# పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివి: కమాండెంట్ కె ఆనంద్ రెడ్డి




సిద్ధవటం అక్టోబర్ 21(మనం న్యూస్) : శాంతి భద్రతల పరిరక్షణ కోసం విధినిర్వహణలో అసువులు బాసిన పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివని ఏపియస్పీ 11వ బెటాలియన్ కమాండెంట్ కె ఆనంద్ రెడ్డి అన్నారు.బుధవారం బెటాలియన్‌లో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కమాండెంట్ కె. ఆనందరెడ్డి పోలీసు అమరవీరుల స్తూపం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించి, అమరులైన పోలీసుల పేర్లను చదివి వినిపిస్తూ వారి త్యాగాలను స్మరించుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు వ్యవస్థ కీలకంగా పనిచేస్తోందన్నారు. ఆందోళనలు, అక్రమ కార్యకలాపాలు, అసాంఘిక శక్తులను నియంత్రించే క్రమంలో పోలీసులు అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నారని తెలిపారు. విధి నిర్వహణలో ఎన్నో సందర్భాల్లో ప్రాణాలను సైతం కోల్పోతున్నారని పేర్కొన్నారు. దేశ రక్షణలో భాగంగా అమరులైన పోలీసుల త్యాగాలను స్మరించుకోవడంతో పాటు, వారి సేవలను భావితరాలకు తెలియజేయడమే పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం ముఖ్య ఉద్దేశమన్నారు. చైనా దళాలతో పోరాటంలో ప్రాణాలర్పిం చిన సీఆర్‌పీఎఫ్ సిబ్బంది త్యాగాలను గుర్తుచేస్తూ, వారి వీరోచిత పోరాటం పోలీసు బలగాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

**అమరవీరుల కుటుంబాలకు అండగా ఉంటాం**

విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసుల కుటుంబాలకు అండగా నిలవడం తమ బాధ్యతని కమాండెంట్ కె. ఆనందరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన అమరవీరుల కుటుంబ సభ్యులకు ఆయన చేతుల మీదుగా జ్ఞాపికలను అందజేశారు. వారికి ఎలాంటి సహాయం అవసరమైనా అందించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుదర్శనరెడ్డి, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, ఏఆర్ఎస్ఐలు, పోలీసు అమరవీరుల కుటుంబ సభ్యులు, బెటాలియన్ సిబ్బంది, నూతనంగా నియమితులైన పోలీసు కానిస్టేబుళు పాల్గొన్నారు.

# పుల్లంపేట మండలంలో 11 ఎంపీటీసీ స్థానాలకు నామినేషన్లు.. మీడియాపై 200

## మీటర్ల దూరం ఆంక్షలు? – ఎంపీటీసీ నామినేషన్ల తొలిరోజు టీడీపీ జనసేన అభ్యర్థు లే బరిలో

పుల్లంపేట అక్టోబర్ 21 ( మనం న్యూస్)పుల్లంపేటలో ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ప్రారంభమైన తొలిరోజు పుల్లంపేట మండలంలో తెలుగుదేశం, జనసేన పార్టీల అభ్యర్థులు మాత్రమే నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎన్నికల అధికారి వీరభద్రారెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసులు వెల్లడించారు. మండలంలోని పలు ఎంపీటీసీ స్థానాల్లో అభ్యర్థులు తమ నామినేషన్లను సమర్పించగా, ఇతర పార్టీల అభ్యర్థుల నామినేషన్లు తొలిరోజు దాఖలు చేయలేదు.ఎన్నికల అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. అనంతసముద్రం–2, అప్పయ్యరాజుపేట–1, బావికాడపల్లి–1, దలవాయిపల్లి–2, జాగువారిపల్లి–3, కొత్తపేట–2, పుల్లంపేట–2, రామసముద్రం–2 ఎంపీటీసీ స్థానాలకు తెలుగుదేశం పార్టీ తరఫున అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. రంగంపల్లి, టీ.కమ్మపల్లి, వత్తలూరు ఎంపీటీసీ స్థానాలకు జనసేన పార్టీ అభ్యర్థులు నామినేషన్లు సమర్పించినట్లు అధికారులు తెలిపారు.

మీడియాపై ఆంక్షలు.. ప్రజాస్వామ్యానికి గొంతుకైన పత్రికలుఎన్నికల నామినేషన్ ప్రక్రియను కవర్ చేసేందుకు వచ్చిన మీడియా ప్రతినిధులకు 200 మీటర్ల పరిమితి విధించడంపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను ప్రజలకు తెలియజేయాల్సిన ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియాపై ఇలాంటి ఆంక్షలు విధించడం ఎంతవరకు సమంజసమనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రజాస్వామ్యంలో మీడియా ప్రజల గొంతుకగా పనిచేస్తుంది. ఎన్నికల సమయంలో అభ్యర్థుల నామినేషన్లు, అధికారుల ప్రకటనలు, ఎన్నికల నిర్వహణకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు చేరవేయడం మీడియా బాధ్యత. అయితే మీడియా ప్రతినిధులు ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించకుండా వార్తా సేకరణ చేసేందుకు అవసరమైన సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.ఎన్నికల నిబంధనలను అమలు చేయడం ఎంత ముఖ్యమో, మీడియా తన విధులను స్వేచ్ఛగా, బాధ్యతాయుతంగా నిర్వహించేందుకు అనుకూల వాతావరణం కల్పించడం కూడా అంతే ముఖ్యం. నామినేషన్ల ప్రక్రియలో పారదర్శకత, ప్రజలకు సమాచారం అందుబాటులో ఉండేలా ఎన్నికల అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.ఎంపీటీసీ ఎన్నికల తొలి రోజు నామినేషన్లతో మండలంలో రాజకీయ సందడి ప్రారంభమైంది. రానున్న రోజుల్లో మరిన్ని పార్టీల అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసే అవకాశం ఉండటంతో ఎన్నికల వాతావరణం మరింత వేడెక్కనుంది.

## భక్తిశ్రద్ధలతో విజయదుర్గాదేవి గ్రామోత్సవం

సిద్ధవటం, అక్టోబర్ 21 మనం న్యూస్ : మండలంలోని సాయి నగర్ గ్రామం శ్రీ భద్రావతి బావ నారాయణ స్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన శ్రీ విజయదుర్గాదేవి అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. 10 రోజులపాటు విశేష పూజలందుకున్న దుర్గామాత అమ్మవారి గ్రామోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ప్రత్యేక కోలాటాల మధ్య గ్రామోత్సవం నిర్వహించారు ఈ సందర్భంగా పి ఆర్ బి హ్యాండ్లూమ్ అధినేత పుత్తా బాబు మాట్లాడుతూ దేవి శరన్నవ రాత్రుల ఉత్సవాలు వైభవంగా జరిగాయని అమ్మవారి విగ్రహాన్ని పాత మాధవరం గ్రామం సమీపాన పెన్నా నదిలో నిమజ్జనం చేస్తామన్నారు ఈ కార్యక్రమంలో గ్రామస్తులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు

## చిట్వేలిలో మొదటి రోజు నామినేషన్ పర్వం ప్రశాంతం



చిట్వేలీ అక్టోబర్ 21 మనం న్యూస్: మండలంలో బుధవారం జరిగిన ఎంపిటిసి నామినేషన్లపర్వం ప్రశాంతంగా జరిగాయి. ఈ మేరకు ఆర్వో జై.భరత్‌రెడ్డి మాట్లాడుతూ మొత్తం 12 నామినేషన్లు దాఖలైనట్లు తెలిపారు. ఇందులో టిడిపి 2, జనసేన 4, వైసిపి 5, ఇండిపెండెంట్ 1 నామినేషన్లు దాఖలు అయినట్లు తెలిపారు. ఎస్ఐ.వినోద్ కుమార్ పటిష్ట బందోబస్తు నిర్వహించారు. 100 మీటర్ల దూరంలో భద్రత ఏర్పాట్లు చేయడంతో నామినేషన్లు ప్రశాంతంగా జరిగాయి.

## పెనగలూరులో ప్రశాంతంగా ఎంపిటిసి నామినేషన్ల ప్రక్రియ

### తొలి రోజు 17 నామినేషన్లు – జనసేన – 09, టీడీపీ –07, ఇండిపెండెంట్ – 01 నామినేషన్లు




పెనగలూరు(అక్టోబర్ 21),మనంన్యూస్: పెనగలూరు మండలంలో తొలిరోజు ఎంపిటిసి నామినేషన్లు ప్రక్రియ ప్రశాంతంగ జరిగింది. పెనగలూరు మండలం లో 11 ఎంపిటిసి స్థానాలకు గాను 09 స్థానాలకు నామినేషన్ లు వేసినట్లు ఆర్వో చిన్న రెడ్డయ్య తెలిపారు. ఇందులో జనసేన నుండి – 09 నామినేషన్లు, టీడీపీ నుండి – 07 నామినేషన్లు, ఒకరు ఇండిపెండెంట్ గ నామినేషన్ వేసినట్లు చెప్పారు. పెనగలూరు మండలంలో తొలి రోజు ఎటువంటి సంఘటనలు జరగకుండా ఎస్సై అరుణ్ కుమార్ రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. నామినేషన్ కేంద్రం నుండి 144 సెక్షన్ ను పక్కగా అమలు చేసారు. కొండూరు–1 ఎంపిటిసి కి మద్దెల రాములమ్మ (జనసేన ) మరియు వద్దే రజిత (జనసేన), కొండూరు –2 ఎంపిటిసి కి ఉదయగిరి శంకరయ్య (జనసేన), వెలగచర్ల నరసింహులు (జనసేన), పొగడతోటి మనోహర్ (జనసేన), శింగారెడ్డిపల్లి ఎంపిటిసికి కోనేటి రాజేశ్వరి ( జనసేన ), కోనేరు జ్యోతి (జనసేన), ఈటిమార్పూరం ఎంపిటిసి కి కోడూరు వెంకటయ్య (టీడీపీ), కోడూరు వెంకట సుబ్బయ్య (టీడీపీ), ఓబిలి ఎంపిటిసి కి కొడిదెల సాయి కుమార్ (జనసేన), గోబ్బూరు హరికృష్ణ (జనసేన), నల్లపురెడ్డి పల్లి ఎంపిటిసికి మొలకల కళావతి (ఇండిపెండెంట్), అనంతంపల్లి ఎంపిటిసి కి రాజబోయిన సులోచన ( టీడీపీ ), రాజబోయిన శైలజ (టీడీపీ), పెనగలూరు–2 ఎంపిటిసి కి కొత్త మధుసుధన్ రావు (టీడీపీ), కొత్త బాలకృష్ణ ( టీడీపీ ), పొందలూరు ఎంపిటిసికి కంభం సురేష్ కుమార్ రెడ్డి ( టీడీపీ ) లు నామినేషన్ లు వేశారు. పెనగలూరు –1 ఎంపిటిసికి మరియు కట్టావారిపల్లి ఎంపిటిసికి నామినేషన్ లు ఎవరూ వేయలేదు. ఈ కార్యకర్తలులో తహసీల్దార్ సుమని, ఎంపీడివో మోహన్, డిప్యూటీ ఎంపీడివో శ్రీకాంత్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



# మానవత్వం చాటుకున్న పెయింట్ కాంట్రాక్టర్ అలిశెట్టి పెంచలయ్య

### దసరా పండుగ సందర్భంగా

### 60 మంది కార్మికులకు దుస్తుల పంపిణీ

చిట్వేలి అక్టోబర్ 21 మనం న్యూస్: దసరా పండుగను పురస్కరించుకుని చిట్వేలి మండలానికి చెందిన పెయింట్ కాంట్రాక్టర్ ఆలిశెట్టి పెంచలయ్య కుటుంబ సభ్యులు తోటి కార్మికుల పట్ల మానవత్వం చాటుకున్నారు. మంగళవారం దసరా పండుగ సందర్భంగా ముందస్తుగా సోమవారం సాయంత్రం గత కొన్ని సంవత్సరాల నుండి తనతో కలిసి పనిచేస్తున్న పెయింట్ కార్మికులకు కొత్త దుస్తులను పంపిణీ చేసి పండుగ సంతోషాలను పంచుకున్నారు. పండుగ వేళ కార్మికుల మోకాల్లో ఆనందం నింపాలనే ఉద్దేశంతో గత కొన్ని సంవత్సరాల నుండి తన తోటి కష్టపడుతున్న కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఆలిశెట్టి పెంచలయ్య మాట్లాడుతూ నిత్యం కష్టపడి పని చేస్తూ భవనాలకు అందమైన రంగులు వేస్తూ కుటుంబం కోసం ఎన్నో కష్టాలు పడుతున్న పెయింట్ కార్మికులకు దుస్తులు పంపిణీ చేయడం ఎంతో ఆనందంగా ఉందని ఆయన తెలియజేశారు. తదుపరి దుస్తులు అందుకున్న కార్మికులు సంతోషం వ్యక్తం చేస్తూ ఆయనకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. సాధారణంగా పండుగలు కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా జరుపుకునే సందర్భాలు కాగా తమతో పని చేసే కార్మికులను సొంత కుటుంబ సభ్యులుగా భావించి వారికి దుస్తులు అందించడం అభినందనీయమని పలువురు ఆయనను అభినందిస్తున్నారు. కార్మికుల శ్రమను గుర్తించి వారి సంతోషంలో భాగస్వామ్యులు కావడం సమాజంలో స్ఫూర్తిదాయకమైన విషయమని అభిప్రాయపడ్డారు. కార్మికుల సంక్షేమ పట్ల యజమానులు, కాంట్రాక్టర్లు ఇలాంటి మానవతా దృక్పదాన్ని కలిగి ఉండడం చాలా అవసరమని వారు అన్నారు. దసరా పండుగ సందర్భంగా 60 మంది కార్మికులకు దుస్తులు పంపిణీ చేసిన అలిశెట్టి పెంచలయ్య కుటుంబ సభ్యుల సేవా భావాన్ని పలువురు అభినందించారు.

# ఒంటిమిట్ట ఎంపీపీ రేసులో బొడ్డే విజయలక్ష్మి

### – ఎంపీటీసీగా నామినేషన్ దాఖలు –



ఒంటిమిట్ట అక్టోబర్ 21 మనం న్యూస్ : వైఎస్సార్ జిల్లా: ఒంటిమిట్ట మండల రాజకీయాల్లో ఎంపీపీ పదవిపై ఆసక్తి నెలకొన్న నేపథ్యంలో, ఎంపీపీ రేసులో ఉన్న బొడ్డే విజయలక్ష్మి ఎంపీటీసీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఆమె నామినేషన్ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఒంటిమిట్ట మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల సందడి మొదలైన నేపథ్యంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ఆశావహులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు. ఈ క్రమంలో బొడ్డే విజయలక్ష్మి ఎంపీటీసీగా పోటీ చేసేందుకు నామినేషన్ వేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఆమె ఎంపీపీ పదవికి పోటీ చేసే అవకాశం ఉందన్న ప్రచారంతో మండల రాజకీయాలపై ఆసక్తి మరింత పెరిగింది. వీరి వెంట బొడ్డే వెంకటరమణ, లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు. గతంలో వీరికి ఎంపీపీ పదవిపై పట్టు ఉన్న నేపథ్యంలో రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది.

# డోలాది రోహణ అలంకారంలో వాసవి మాత దర్శనం



ఒంటిమిట్ట, అక్టోబరు 21 మనం న్యూస్ : ఒంటిమిట్ట శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవి నవరాత్రి మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో ముగిశాయి. ఉత్సవాల్లో చివరి రోజు వాసవి మాతను డోలాది రోహణ అలంకారంలో విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి 9 గంటలకు మంత్రపుష్పం, దశ హారతులతో మంగళహారతి సమర్పించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. నవరాత్రుల సందర్భంగా అమ్మవారిని వివిధ అలంకారాల్లో దర్శించుకున్న భక్తులు చివరి రోజు కార్యక్రమాల్లోనూ పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. దీంతో ఆలయ పరిసరాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.